క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

బెజ్జూర్: ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం మండలంలోని సోమిని గ్రామంలో తనిఖీలు నిర్వహించగా మొండయ్య అనే వ్యక్తి ఇంట్లో ఐదు క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించామన్నారు. బియ్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల యజమానులపై కేసు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకొని ఆరుగురు యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ పెద్దవాగు, చిలాటిగూడ వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్డు వద్ద 6 ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా హీరసుక జయంతి

ఇంద్రవెల్లి: గోండి ధర్మగురు హీరసుక జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడలో ఘనంగా నిర్వహించారు. పర్ధాన్‌గూడ గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో హీరసుక స్మారక జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖడే ఉత్తం, ఆర్కా పుష్పలత, కుమ్ర రఘురాం, మడావి విశ్వనాథ్, కుమ్ర భీంరావ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్చోడ: మండలంలోని గుండివాగు గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం గ్రామస్తులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుండివాగు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

ఇచ్చోడ: తల్లిదండ్రులను గౌరవించాలని సంత్ వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో 1023వ సత్‌సంగ్‌లో పాల్గొని ప్రవచనలు చేశారు. ప్రస్తుతం ప్రతిఒక్కరూ యాంత్రీకరణ జీవితానికి అలవాటు పడ్డారని అన్నారు. మనిషి జీవించేందుకు డబ్బు అవసరమే కానీ డబ్బుతో మనుషుల జీవితాలను ముడిపెట్టవద్దన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నేరడిగొండ: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా నేరడిగొండలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మండల కేంద్రంలో జరిగే రక్త శిబిరానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చలి బోనాల సందడి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేట, పాత ఉట్నూర్ గ్రామాల్లో గ్రామస్తులు ఆదివారం పోచమ్మ ఆలయంలో చలి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతీ ఏటా శివరాత్రికి ముందు చలి బోనాలు సమర్పించడం తరతరాల నుంచి అనవాయితీగా వస్తుంది. తమ ఊరు కుటుంబంలో అందరు సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో ఉండాలని చలి బోనాలతో పోచమ్మను మొక్కుకున్నారు.

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలి

బోథ్: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలని కై లాస్ టెకిడి లింబాజీ మహరాజ్ అన్నారు. ఆదివారం సొనాల మండలంలోని ఘన్‌పూర్‌లో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి ప్రత్యేక చేసి, భోగ్ బండార్ నిర్వహించారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పగలు ఎండ.. రాత్రి చలి!

- పగలు మండుతున్న ఎండ
- రాత్రి చలి గాలులు
- జిల్లాలో భిన్నమైన వాతావరణం
- జాగ్రత్తలు తప్పనిసరి

శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు(డిగ్రీ సెల్సియస్)

ప్రాంతం	కనిష్ట	గరిష్ట
గిన్నెధరి	9.2	33.5
సిర్పూర్(యూ)	9.2	32.5
తిర్యాణి	11.5	34.3
ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు		
సిర్పూర్(యూ)	10.2	34.2
గిన్నెధరి	10.4	35.7
వాంకిడి	12.5	35.9



కౌటాల: ఒకవైపు తగ్గని చలి గాలులు.. మరోవైపు పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు.. ఇలా అసాధారణ వాతావరణం జిల్లావాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పగలు సాధారణం కన్నా ఎక్కువ ఉంటున్న ఎండలు రాత్రి కాగానే ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేకువ జామున చలి గాలులు వీస్తున్నాయి. మార్చి నుంచి ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతూ రావడం సాధారణం. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం గమనార్హం. ఉదయం 9 గంటలు తర్వాత తీవ్రత పెరుగుతూ సాయంత్రం 4 గంటల వరకు ఉంటోంది. పగటి పూట ఎండ పెరగడంతో చాలా మంది బయటకు రావడం లేదు. దీంతో రోడ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. అలాగే బయటకు వచ్చిన వారు వేడి నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సడన్ సమ్మర్..

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేకువ జామున చలి, మంచు ప్రభావం ఉంటున్నా వారం రోజులుగా మధ్యాహ్నం కాగానే 35 డిగ్రీల నుంచి 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుంది. జిల్లాలో అసాధారణ వాతావరణ పరిస్థితులు గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అటు చలి, ఇటు ఎండ వేడిమి నమోదవుతున్నాయి. పగలు, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. పగటి ఉక్కపోత ఊపిరి సలుపన్వీడం లేదు. ఇలాంటి వాతావరణం వల్ల ప్రజలు పలు రోగాల బారిన పడే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జ్వరాలు, దగ్గు వంటి రోగాలు వచ్చే ప్రమాదముంది. ఎండ తీవ్రత వల్ల కంది కోతలకు, మిర్చి కోతలకు వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారు. భానుడి భగభగలకు అప్పుడే శీతలపానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాలు, మండల కేంద్రాల్లో శీతల పానీయాల షాపులు ఇప్పటికే ప్రారంభించారు.

తగ్గని చలి తీవ్రత..

జిల్లాలో ఇటీవల వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పగలు వేడిగా ఉండటం, రాత్రి చల్లగా మారడంతో వైవిధ్యమైన పరిస్థితులు నెలకొన్నాయి. చలి తీవ్రత ఇంకా పూర్తిస్థాయిలో తగ్గలేదు. జిల్లాలో ఇప్పటి కనిష్ట ఉష్ణోగ్రతలు 10లోపు నమోదు అవుతున్నాయి. రాత్రి సమయంలో చలి గాలులు వీస్తున్నాయి. దీంతో పలు రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. జిల్లాలో ఆదివారం సిర్పూర్(యూ)లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10.2 నమోదు కావడంతో రాత్రి సమయంలో చలి గాలులు వీచాయి. దహెగాంలో మధ్యాహ్నం 37.3 పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి చలి, పగలు ఎండ కారణంగా జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

- రాత్రి సమయాల్లో మంచులో ఎక్కువగా తిరగకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో తిరగాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి.
- పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలి.
- గొంతునొప్పి, జ్వరం, ఒంటి నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తే వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా గుర్తించి వైద్యం చేయించుకోవాలి.
- డ్రెయినేజీల సమీపంలో నివసించే వారు దోమల బెడద లేకుండా జాగ్రత్త పడాలి.
- ఇప్పటి నుంచే వేసవి ఎండలు మండుతున్నాయి. రోడ్డు వెంట విక్రయించే చల్లని రంగు పానీయాలు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి. మద్యం, మాంసం తగ్గించాలి.
- శరీరంలో నీటి శాతాన్ని సమతుల్యంగా ఉంచేందుకు రోజుకు 4లీటర్ల వరకు నీరు తాగాలి. పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు వాడడం, టోపి ధరించడం మంచిది.
- వాతావరణ అనుకూల దుస్తులు ధరించాలి.

'టాలెంట్ టెస్ట్' విద్యార్థులకు ఉపయోగకరం



ప్రశ్నపత్రం విడుదల చేస్తున్న సతీశ్

రెబ్బెన: పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగకరమని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీశ్ అన్నారు. మండలంలోని గంగాపూర్ కేజీబీవీలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న టాలెంట్‌ను వెలికితీయటంతో పాటు పరీక్షల పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులంతా సమర్థవంతంగా వార్షిక పరీక్షలు ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థులంతా మంచి మార్కులు సాధించాలని, భవిష్యత్తు పునాదులకు విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రవీణ్‌కుమార్‌పై అసత్య ప్రచారం మానుకోవాలి'



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కౌటాల: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అసత్య ప్రచారం చేస్తున్న బెజ్జూర్ మండలం కుకుడా గ్రామానికి చెందిన కోట్రంగి రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు కౌటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్పీపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ యూత్ మండలాధ్యక్షులు తాళ్లపల్లి కార్తీక్, ఉపాధ్యక్షులు చునార్‌కర్ దిలీప్, నాయకులు మోతిరాం, నవీన్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నస్పూర్: నేటి సమాజంలో విద్యార్థులకు విద్యతో పాటు ఇతర రంగాల్లో నైపుణ్యం అవసరమని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ. శ్రీనివాస్ అన్నారు. సీసీసీ సింగరేణి పాఠశాల 47వ వార్షికోత్సవాన్ని పాఠశాల ఆవరణలో శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి జీఎం మాట్లాడుతూ.. సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో అతి తక్కువ ఫీజుతో, అన్ని సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సింగరేణి పాఠశాలలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తాను కూడా సింగరేణి పాఠశాలలో విద్యనభ్యసించి ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎడ్యుకేషన్ సెక్రటరీ కొత్తగూడెం జీ. శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటి నుంచే సరైన ప్రణాళికలు రచించుకొని, లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, కరస్పాండెంట్ రాజేశ్వర్, హెచ్ఎం సంతోష్, ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, లక్ష్మయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వితీయ వార్షికోత్సవం



సంప్రదాయ పూజలు చేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని ఖైరిగూడలో జగదాంబ, సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ మందిరం ద్వితీయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ పూజలు చేశారు. బోగ్‌భండార్‌లో పూజలు చేసి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ లంబాడీల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ సూచించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుబ్బారావు, చవాన్ ఇందల్, గణపతి, రమేశ్, ఆలయ పూజారి వసంతరావు, శంకర్, రవీందర్, శివాజీ గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు



చింతలమానెపల్లి: పేకాట ఆడుతున్న వారితో పోలీసులు

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని సాలెగూడ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బుద్దె రవీందర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి సాయంత్రం సాలెగుడ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.3,020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినట్లు తెలిస్తే డయల్ 100కు కాల్ చేసి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా, బాబాసాగర్ గ్రామాల శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న 16 మందిని పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబ్బా, బాబాసాగర్ గ్రామాల శివారుల్లో రెండు పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో డబ్బా శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు, బాబాసాగర్‌లో 10 మందిని పట్టుకున్నారు. ఈమేరకు వారి నుంచి రూ. 4500 నగదు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

'బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి'



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుతోనే గ్రాడ్యుయేట్ల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు భర్తీ చేయక నిరుద్యోగులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేయాలని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధన్యత ఓటు వేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షులు కుంచాల విజయ్, నాయకులు కమలాకర్, రవి, మిథున్, చందు, మధుకర్, తిరుపతి, వెంకటేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ అన్నారు. ఆదివారం చింతలమానెపల్లిలో ఆయన బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలను గెలిపించాలన్నారు. శాసన మండలిలో ప్రజల గొంతుకలా బీజేపీ అభ్యర్థులు పని చేస్తారన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు డోకె రామన్న, బీజేపీ జిల్లా నాయకులు ఎల్ములె మల్లయ్య, నాయకులు తిరుపతి గౌడ్, రంగన్న, మోహన్, పవన్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం

- ఏడాదికే కంకర తేలిన వైనం
- కాంట్రాక్టర్ అలసత్వం.. ప్రయాణికులకు శాపం
- నాణ్యతలేని రోడ్డు వేసిన మహారాష్ట్ర ప్రభుత్వం
- ఇబ్బందుల్లో సరిహద్దు గ్రామాల ప్రజలు



రోడ్డుపై తేలిన కంకర



అధ్వానంగా మారిన రోడ్డు

కెరమెరి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పరంధోళి తండా, పరంధోళి, మహరాజ్‌గూడ, ముకదంగూడ గ్రామాల మధ్య నిర్మాణం చేపట్టిన రోడ్డు గుత్తేదారు నిర్లక్ష్యంతో ఏడాది తిరగక ముందే అధ్వానంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సరిహద్దు గ్రామాలు కావడంతో తెలంగాణ ప్రభుత్వం కంటే ముందే మహారాష్ట్ర ప్రభుత్వం రోడ్డు సౌకర్యం కల్పించింది. కానీ గుత్తేదారు నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.2 కోట్లు బూడిద పాలు..

ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఇరు ప్రభుత్వాలను వేడుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. ఫలితంగా గతేడాది రూ. 2 కోట్లు మంజూరు కాగా అదే తడువుగా మహరాజ్‌గూడ నుంచి పరంధోళి తండా వరకు 5 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మించారు. కాని ఏడాది తిరగక ముందే రోడ్డు మరమ్మతులకు గురైంది. ప్రస్తుతం రోడ్డుపై అనేక చోట్ల కంకర తేలింది. ఈ రోడ్డుపై ద్విచక్రవాహన దారులు జారిపడి గాయాల పాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. నిర్మాణం చేసేటప్పుడే రోడ్డు నాణ్యతపై ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నించారు. కానీ గుత్తేదారు, అధికారులు పట్టించుకోలేదు.

జంగుబాయి ఆలయానికి వెళ్లే మార్గం..

ఆదివాసీల మహిమాన్వితం జంగుబాయి ఆలయానికి వెళ్లేదారి ఇదే కావడంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన జంగుబాయి ఉత్సవాలకు వచ్చిన భక్తులు రోడ్డు కారణంగా ఇబ్బందులు పడ్డారు. నానాటికీ రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారుతుండడంతో ప్రయాణికులు గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం రోడ్డు వేయాలన్నా ఇంతకు ముందే మహారాష్ట్ర ప్రభుత్వం రోడ్డు వేయడంతో కొత్తగా వేయలేని పరిస్థితి ఉంది. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన రోడ్డు ఏడాదికే అధ్వానంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాక ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలు చేపడతాం



మూడు రోజుల క్రితమే రోడ్డు నిర్మించిన గుత్తేదారుతో ఫోన్‌లో రోడ్డు మరమ్మతులపై మాట్లాడాను. నాలుగు రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించాలని కోరాను. మరమ్మతులు చేపట్టకుంటే ఆందోళనలు చేపడతాం.

– కాంబ్లె లక్ష్మణ్, పరంధోళి

ఇబ్బంది పడుతున్నాం



తారు రోడ్డుపై నడుస్తామన్న సంతోషం ఏడాదిలోని ఆవిరై పోయింది. ఎక్కడ పడితే అక్కడ కంకర తేలి, చూర లేచి ఉండడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇరు ప్రభుత్వాలు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలి.

– పతంగే లింబాదాస్, ముకదంగూడ

'కర్ర'ంట్ స్తంభం



దహెగాం: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో కర్రను స్తంభంలా ఉపయోగించి పైకి లేపారు. వేలాడుతున్న తీగలను సరిచేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గాలి దుమారానికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి చెందిన వారు గెలుపుకోసం ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని ఆదిలాబాద్ రూరల్ మండలంలో గల బెల్లూరి మైదానంలో జోగు ఆశన్న- భోజమ్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యూనుస్, సాజిదొద్దీన్, బట్టు సతీష్, వినోద్, క్రీడా నిర్వాహకులు అయ్యూబ్ ఖాన్, అద్నాన్, జమీల్, ఓంప్రకాష్, శ్రావణ్, నానీ, రషీద్ ఖాన్, అఫ్సర్ పాల్గొన్నారు.